# వలసబతుకులు

"బిడ్డా..... ముత్తెమూ....నా ముత్తెమసొంటి కొడుకు నువ్వు. వత్తన్న వత్తన్న బిడ్డ లగ్గం పెట్టుకోండ్రి అంటివి. బిడ్డలగ్గం బెట్టుకున్నంక పత్రిక పంపుండ్రి వత్తనంటివి. పుస్తెగట్టెయాల్లదాక ఎదురు సూస్తిమి. నువ్వు రాలేదని అందరి గుండెలు చెరువులయ్యె. నీబిడ్డయితే ఏడ్సుకుంట కూసుండె. ఇంటి ముంగట పుట్టెడు మంది ఉంటె నువ్వొక్కనివి కానరాని దేశంల ఉంటివి. ఎందుకు రాలేదోనని మేమంతా బాధపడవడ్తిమి.

"బిడ్డా! ఎందింటున్నవో యాడవంటున్నవో ఏడేండ్లపొద్దాయె నువ్వు కండ్లవడక. నీ బంగారు మొఖం ఎప్పుడు కనవడుతదోనని బెంగటిల్లుతున్న. సావుదాలకైనా నిన్ను సూత్తనో లేదోనని భయంగుంది. ముందటి లెక్క చాతనైతలేదు. నాలుగు అడుగులు పడితేనే దమ్మొత్తుంది. నాయిన సంగతి నీకు తెలిసిందేనాయె. అప్పటికిప్పటికీ భూమి పట్టుకునే లేత్తుండు. రోజు రోజుకుదంద ఇంత ఎక్కువైతొంది గనీ తగ్గుతలేదు. నువ్వు లెవ్వని మ్యానమామ తోని కాళ్ళు కడిగిపిచ్చిన."

"ముత్తెమూ....ఏదో కలిగినకాడికి కాలుజాపి పండుకోనీయకుండా పోలీసోల్లు ఎంటవడిరి. మనకు వాళ్ళెరుకలేదు. వీళ్ళెరుకలేదుగనీ అత్తన్నరుపోతన్నరని బట్టగాల్సిమీదేసి కావలిగాసిరి. ఇగవాళ్ళతోని వషపడదనిగాదు బిడ్డా గంతదూరం పోయింది.

ఎంతదూరం పోయినా ఏడేమామకలన్నట్టు పాణాలకు తెగాయించిపోతే అది కంపెనీవి సాగాదని చెప్పిండ్రంటివి. రెండేండ్ల కింద అక్కడినుండి వచ్చిన పక్క ఊరాయన చెప్పిండు. కైకిలు దొరికితే తిండి లేకుంటే ఎండుడటగద. ఏదో ఉన్నన్ని రోజులున్నవు. అంటినకాడికి అంటింది. జెట్టనరా బిడ్డా! ఈంతపానం బోయేముందు నువ్వు కండ్లముందులేకుంటే పుట్టెడు కలకలుంటది.

ఐదుగురు ఆడిపిల్లలతోడ ఒక్క కొడుకు వని పాణమెత్తుసాదుకున్న. అరికాలుకు ముళ్ళు నాటతే గిల గిలలాడి పోయిన. ఇద్దరి పిల్లల తండ్రివైనా అరుక బరువు తలుగనియ్యలేదు. ఇప్పుడు దేశంగాని దేశంలున్నవు ఏమయ్యేదినేను సూడత్తున్నానా!

నువ్వు పోయినంక యాడాదిదాకా ఇంటిచుట్టు తిరిగిండ్రు పోలీసోల్లు. దేశం పోయిండని చెప్పినం. అడ్రస్ అడిగితే కారటేత్తలేడన్నం. ఇక వచ్చుడు బందు జేసిండ్రు. ఇప్పుడు పూర్తిగా మర్చిపోయిండ్రు. నువ్వు గాల్ల భయానికి రావద్దనుకుంటున్నావేమో! గాభయమేంలేదిప్పుడు.

పొద్దుగూకితే తెల్లారితే కండ్లల్ల కదులుతున్నవు. నాయిన కలువరిత్తన్నడు. ఇక్కడ నీ భార్య చిన్నబిడ్డ పెద్ద బిడ్డ అల్లుడు మంచిగనే ఉన్నరు. లగ్గం పోటువలు పంపినం నీకు ముట్టినయా తెలిపేది. ఈ ఉత్తరం ముట్టంగనే మల్ల ఉత్తరం కాదు నువ్వేరావాలి. నీ కొరకు ఎదురుచూస్తూ

మీ అవ్వ

మల్లారపు ఎల్లవ్వ

ఉత్తరం చదివిన ముత్యం కళ్ళు చెమ్మగిల్లాయి. ఇంటిమీదికి పానం గుంజుతుంది. ఆవేదనగా నిట్టూర్చాడు. తన బతుకు ఇలా మారిపోయిందేం? తనని తాను ప్రశ్నించుకున్నాడు. తను ఎక్కువగానే కష్టపడుతున్నాడు. డబ్బు సంపాదిస్తున్నాడు. తెలివిగా తప్పించుకుంటున్నాడు. అయినా ఎప్పుడూ ఏదో అవాంతరం ఎదురౌతూనే ఉంది. చేసిన కష్టం, డబ్బు వృధా అయిపోతుంది.

ఊరు, చిన్ననాటి మిత్రులు, పిల్లలు అందరూ గుర్తుకొచ్చారు ముత్యంకు. ఊర్లో ఎవరికీ అన్యాయం జరిగినా ఊర్కొనే వాడు కాదు ముత్యం. అందరికంటే ముందుండి ప్రశ్నించేవాడు. వడ్ల బేరగాల్లు మొదలుకొని చిన్న చిన్న వ్యాపారులవరకూ అతడంటే దడ మొదలయింది. సరియైన ధరలు పెట్టడం లేదని కల్తీసరుకులు అమ్ముతున్నారని ఒకటి రెండుసార్లు అటకాయించాడు. అదే అతడిని ఊరికి దూరం చేసింది. నక్సలైట్లతో సంబంధం ఉందని వ్యాపారులు పోలీసులకు రహస్యంగా చెప్పారు. ఊరు విడిచేవరకూ వదల్లేదు పోలీసులు.

"అక్కడ అన్యాయాలను ఎదిరించాను. ఇక్కడ అన్యాయమైపోతున్నాను." తనలోతానే గొణుక్కుంటూ మరో ఉత్తరం అందుకున్నాడు. తన ఊరినుండి చిన్ననాటి మిత్రుడు వ్రాసిన ఉత్తరం కూడా ఆరోజే అందింది. 'వీడు సర్పంచ్‌గా గెలిచి హాయిగా ఊర్లో ఉన్నాడు. నేనేమో దేశాలు తిరుగవడితిని' అనుకుంట ఉత్తరం విప్పాడు.

"పూజ్యులైన భర్తగార్కి

నమస్కరించి మీ భార్య చంద్రకళ రాయునది ఇక్కడఅంతా క్షేమం. నువ్వు క్షేమమని తలుస్తాము. బిడ్డలగ్గం అయిపోయింది. వత్తవత్తనని రాకపోతివి. పందిట్ల అది అలిగి కూసుండె. నువ్వు రానని చెబితే లగ్గమే పెట్టుకోకపోదుము. ఎత్తుకోలు మొత్తుకోలు అన్నట్టయింది బతుకు. మనిషి కొకమాట అనవట్టిరి. ఆడిపిల్లలగ్గమాయె! మొగడచ్చెదాక ఆగితేందని కొందరనవట్టిరి. దీని ఉరుకులాటనే చెప్పరాదు. మొగనికి ఎరుకనో లేదో అని కొందరనవట్టిరి. అన్నిముచ్చట్లు నీకు రాయనే వడితి. నువ్వు మంచిగుంటదంటేనే పిల్లగాన్ని కాయం జేస్తి. వత్త నంటెనే లగ్గం మొగిత్తి. యాల్లకు బరువు నానెత్తిమీద పెట్టి నీ అంతల నువ్వు వుంటివి.

ఆడిపిల్లలగ్గం వట్టిగనే ఐతదా! ఎన్ని సుదురాయించాలె. నీ అక్కలే వచ్చి చేసిరా లేక బావలేవచ్చిచేసిరా? మీదికెల్లి అలుగుడులు గులుగుడులు. మీ అవ్వనాయిన లైతే గొంగడి నాదిగాదు, చెప్పులు నాయి గావన్నట్టు తిరిగిరి. ఎప్పుడు గిదే ఎత్తుకోలు మొత్తుకోలేనాయె. కొన్ని రోజులు ఇంటిపట్టు పట్టకనే తిరిగితివి. ఇక్కడుండి చేత్తే ఇల్లు నిండిందని మస్కట్ పోతివి. చేసిన బాకీలు తీరెవారకే నాలుగేండ్లు దాటె. యాడాది నుండి ఒక్క పైస పంపకనేపోతివి. ఏంబెట్టే లగ్గం జేత్తననుకున్నవు.

మాతమ్ముడు ఆదుకోవట్టి ఈంత లగ్గం కార్యం గట్టెక్కింది. నువ్వే పంపాలె నేనే లగ్గం జెయ్యాలంటే అచ్చిన సుట్టాల ముందట ఇజ్జతుపోతుండె. లగ్గం లగ్గమని ఆరునెల్ల ముందునుండి రాత్తున్ననీకు. వత్తున్నా తెత్తున్నా వత్తున్నా తెతున్నా నంటివి. వచ్చుడు లేదాయె తెచ్చుడు లేదాయె. నీకంటె ఏడెనుకల పొయినోల్లు రెండేండ్లకోసారి ఇంటికొచ్చి పోతుండ్రు. తీరైన సామాను దెత్తుండ్రు. పొయిందు పొయిందన్నట్టేగని ఏంమంచిగలేదు.

నా రెక్కలగల్ల కట్టం నేను చేసుకతింటున్న. నువ్వు పంపిన పైసలన్ని ఖర్చు పెడుతున్ననీ మీ అవ్వ నాయనలు ఒక్కటే బొబ్బ. వాళ్ళకు అప్పుఅంశం లెక్కలు చెప్పుతలేనట. ఇండ్లేదో అన్నలకు తమ్ముల్లకు జేరేత్తన్నానని వాళ్ళకు అనుమానం. ఏంలేదుగనీ గీ కయ్యాం సంపాయించిపోయినవు. నీ అంతల నువ్వు అక్కడ మంచిగనే ఉంటున్నవు. నేనే ఇక్కడ ఎల్లదియ్యలేక సత్తున్న.

నీకు మామీద దయుంటే పైసలుపంపు. అప్పులు గడుత. నాకు పెండ్లాంలేదు పిల్లలు లేరనుకుంటే ఊకుండు.

ఇట్లు

మీ భార్య చంద్రకళ

ఉత్తరం మడిచి పక్కన బెట్టాడు ముత్యం. కన్న తల్లి కడుపు జూసిందట పెండ్లాం జేబు చూసిందట. అన్నమాటలు గుర్తొచ్చాయి. విరక్తిగా నవ్వుకున్నాడు. చేతిలో పాస్‌పోర్ట్ లేదు. అది దుబాయిలోనే ఉండిపోయింది.

ఏడేండ్ల క్రితం ముందుగా దుబాయిపోయాడు ముత్యం. అక్కడ కంపెనీ సరిగా జీతం ఇవ్వలేదు. కపిల్‌పైకి ఎదురుతిరిగాడు ముత్యం. అతడిని ఇండియా పంపించడానికి అన్ని ఏర్పాట్లు చేసాడు కపిల్. ఈ విషయం తెలుసుకున్న ముత్యంకు గుండె దడదడ లాడింది. వచ్చి ఆరునెలలు కూడా కాలేదు. ఇప్పుడేవెళ్తే నింపిన డబ్బు ఎలా తీర్చేది అనుకున్నాడు. అదేరాత్రి మరో ఇద్దరు మిత్రులతో మస్కట్ బయల్దేరాడు.

బార్డర్‌లైన్ దాటించడానికి కొంత డబ్బు తీసుకుని ఒక వ్యక్తి సహాయం చేసాడు. ఇటునుండి అటువైపు అటునుండి ఇటువైపు ప్రతిరోజు వందలమంది దొంగచాటుగా వెళ్తారని గ్రహించాడు ముత్యం. అలా దాటించడమే వృత్తిగా కొంతమంది జీవిస్తున్నారని తెలిసిందతనికి. ఆ వృత్తిని చేపట్టిన వారు ఇండియానుండి వచ్చినవారే కావడం అతడికి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఈ దేశాల్లో కూడా ఇంత మోసం జరుగుతుందా అనిపించింది.

ఎడారిలో మూడు రోజుల నడక తర్వాత చిన్న ఊరు చేరుకున్నాడు. అక్కడినుండి తన మిత్రుడి వద్దకు ఒమన్ చేరుకున్నాడు. ఇద్దరూ పక్కపక్క ఊరివారే. అంతకుముందు ఉత్తరాలు వ్రాసుకున్నారు. అతడున్నాడనే ధైర్యంతోనే బార్డర్‌లైన్ దాటాడు ముత్యం. చేతిలో పాస్‌పోర్ట్ లేదు. కంపెనీ వీసా కొనుక్కోవాలంటే పాస్‌పోర్ట్ కావాలి. లెబర్‌కార్డు కావాలి. మస్కట్‌లో రూల్స్ అన్నీ కఠినంగా ఉంటాయని, ఏ తప్పుచేసినా శిక్ష పకడ్బందీగా అమలు చేస్తారని విన్నాడు. ఎలాగైనా మిత్రుడు తనకు దారి చూపిస్తాడనుకున్నాడు.

ఇక్కడ మిత్రుడి స్థితిచూసాక ముత్యం పరిస్థితి మరింత ప్రశ్నార్థకంగా మారింది. కంపెనీలో తక్కువ జీతం ఉందని ఎవరినీ తెలియకుండా బయటకు వచ్చి పని చేసుకుంటున్నాడతడు. ముదీర్‌కు ఈ విషయం చెప్పి నెలసరి కొంత డబ్బు ఇస్తే లేబర్ కార్డ్, ఎక్కడైనా పనిచేసుకునేందుకు పర్మిషన్ కార్డ్ ఇచ్చేవాడే. వాడికి డబ్బు ఇవ్వడమెందుకని ఇలాగే పనిచేసుకుంటున్నాడు. ముత్యంను చూసి జాలిపడుతూ వివరాలన్నీ చెప్పాడు.

"అన్నా.....నువ్వు ఇంటికి వెళ్ళడే మంచిది. నీకు పాస్‌పోర్ట్ లేకపోయినా ఇంటికి పంపే ఏర్పాటు చేస్తాను. విజిటింగ్ విసామీద ఇక్కడికి వచ్చి స్థిరపడిపోయే వారు చాలామంది ఉంటారు. అటువంటి వారికి కొందరు బ్రోకర్‌లు ఇక్కడి నుండే విజా పంపుతారు. వారు రాగానే పాస్‌పోర్ట్, ఆఫ్ అండ్ డౌన్ టికెట్ ను వాపసు తీసుకుని అంతకుముందు అక్కడ ఫ్రీ విజాలో ఉన్న మరో వ్యక్తిని ఇండియాకు పంపే ఏర్పాట్లు చేస్తారు. పాస్‌పోర్ట్‌లో ఫోటోలో తలవరకు కత్తిరించి దానిమీద ఈ వ్యక్తియొక్క ఫోటో అతికించి అదేపేరు మీద పంపిస్తారు. నిన్ను కూడా అలాగే పంపిస్తాను. కానీ ఇరవైవేల వరకు ఖర్చయితాయి" అన్నాడు.

టికెట్ డబ్బులకొరకైనా పని చేయాలి కాబట్టి బిల్డింగ్ కాంట్రాక్టు వద్ద పనిచూసుకున్నాడు ముత్యం. అందులో తెలుగు వాళ్లుండడం చేత పని సులభంగా దొరికింది. మిత్రుడి రూంలోనే ఉండి వండుకుని తింటూ నాలుగు నెలలు గడిపాడు. ఇరవై వేయిల రూపాయలు జమయ్యాయి. ఇంటికి ప్రయాణమవుదామనుకుంటుండగా తెలుగు వ్యక్తి ఒకరు కపిల్‌ను పరిచయం చేసాడు. ఇరవైవేలు ఇస్తే లేబర్ కార్డ్ ఇప్పిస్తానని నకిలీ పాస్‌పోర్ట్ తయారుచేయిస్తానని కపిల్‌తో పర్మిషన్ కార్డ్ కూడా ఇప్పిస్తానని చాటుమాటుగా కాకుండా నేటుగా పని చేసుకోవచ్చునని హామీ ఇచ్చాడు. ముత్యంకు ఆశ కలిగింది. వెంటనే ఇరవైవెయిలు అతడికిచ్చాడు. వారం రోజుల తర్వాత అతడు మళ్ళీ కనిపించలేదు.

తాను మోసపోయానని తెలుసుకున్నాడు ముత్యం. మళ్ళీ అలాగే పనిచేస్తూ ఆరు నెలలు గడిపాడు. ఆలోపు మిత్రడు ఇండియన్ ఎంబసీ ద్వారా ఇండియా వెళ్ళే ఏర్పాట్లన్నీ చేసుకున్నాడు. మరో నాలుగు నెలలు ఇలాగే పనిచేసి మరికొంత డబ్బును కూడబెట్టుకుని రమ్మని సలహా ఇచ్చాడు. ముత్యంకు నిజమే అనిపించింది. తన బతాకా (ఐడెంటీకార్డ్) చెక్ చేసి దొరికేవరకు పనిచేయాలని నిశ్చయించుకున్నాడు.

స్నేహితుడికి ఆడబ్బునిచ్చి ఇండియాలో తన భార్యకిమ్మన్నాడు. ఇండియా వచ్చాక తనను బొంబాయిలో టాక్సీవాడు ఎక్కడికో తీసుకునిపోయి చంపుతానని బెదిరించారని ఏదో అదృష్టం బావుండి తాను బయటపడ్డానని అందుకే డబ్బు ఇవ్వడం లేదని మిత్రుడు ఉత్తరం రాసాడు. ఏడ్వడం తప్ప మరేం చేయలేకపోయాడు ముత్యం. అదంతా అబద్ధమని అతడికి తెలుసు.

అప్పటికే తెలుగువాళ్ళుండే చోట్లన్నీ పరిచయమయ్యాయి. సెక్యూరిటీ పోలీసుల కంట, మున్సిపాలిటీ వారికంట పడకుండా కూలీ చేసుకోవడం మొదలెట్టాడు. ఆరు నెలల తర్వాత ఇంటికి ముప్పయి వేల రూపాయల డ్రాఫ్టు పంపాడు.

అంతకుముందు తాను ఎక్కువగా కూలీకి వెళ్ళే కంపెనీ కొత్త కాంట్రాక్టుపని పట్టింది. ఫోర్‌మెన్ తెలుగువాడు కావడంతో అదే కంపెనీలో విజా ఇచ్చే ఏర్పాటు చేస్తానన్నాడు. డబ్బు ముందుగా నింపే అవసరం లేదని జీతం నెల నెలా ఇచ్చినప్పుడే పట్టుకుంటారని చెప్పాడు. ముత్యం ఒప్పుకున్నాడు. ఫోర్‌మెన్ నకిలీ పాస్‌పోర్ట్ తెప్పించి కంపెనీ పెద్ద హరిబాబుతో మాట్లాడి విజా ఒకే చేసాడు. లేబర్‌పని అయినా జీతం ఓ.టి కలిపితే ఎనిమిది వేల వరకు వస్తుందని లెక్కగట్టాడు ముత్యం. ఐదునెలల వరకు తిండి మాత్రంగా డబ్బు తీసుకుంటే విజా పైసలు ముట్టి పోతయనుకున్నడు. ఐదునెలలు అలాగే పనిచేసాడు. కార్డ్ ఉంది కాబట్టి తేలిగ్గా

ఊపిరిపీల్చుకున్నాడు. ప్రతీ శుక్రవారం సెలవు దినం కాబట్టి. మిత్రులను కలవడానికి స్వేచ్ఛగా వెళ్ళేవాడు. వెళ్ళాలనుకున్న చోటికి నిర్భయంగా వెళ్ళేవాడు.

ఐదు నెలల్లో బాకీ తీరిపోయింది. మరో ఐదునెలలు పని చేసాడు ముత్యం. కంపెనీ నష్టాల్లో ఉందని మూడు నెలల జీతం మాత్రమే ఇచ్చాడు హరిబాబు. అదీ ఐదువేల చొప్పన్నే కట్టించాడు. అప్పటికే అప్పులబాధ అధికమవుతుందని ఇంటినుండి లెటర్లు వస్తున్నాయి. మస్కట్ వచ్చి రెండేండ్లు దాటింది. దుబాయిలో ఆరు నెలలున్నాడు. దగ్గర దగ్గర ఇండియానుండి గల్ఫ్ వచ్చి మూడేండ్లవుతుంది. కేవలం ముప్పైవెయిలు మాత్రమే పంపాడు. అప్పు వడ్డీతో సహా రెండింతలయిందనుకున్నాడు. భయంపట్టుకుంది ముత్యంకు.

ధైర్యం చేసి కంపెనీని విడిచి బయటకు పారిపోయాడు ముత్యం. సలాల్‌కు వెళ్ళి వ్యవసాయ కూలీగా మారిపోయాడు. సలాల్‌లో పండ్లతోటలున్నాయి. వ్యవసాయంలో అతడి నైపుణ్యాన్ని గుర్తించి మంచి జీతం ఇచ్చారు. ఏడాదిన్నరలో బాకీలన్నీ తీర్చేడబ్బును పంపించాడు. అలుపు లేని శ్రమ చేయడం వల్ల ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆరునెలలు ఏపనీ చేయలేక ఉత్తగనే ఉన్నాడు. కోలుకున్నాక మళ్ళీ పని చేయడం మొదలెట్టాడు. అప్పులు తీరిపోయాయన్న ఆనందం అతడికి రెట్టింపు ఉత్సాహాన్నిచ్చింది.

అప్పుడే మక్కా యాత్ర మొదలయింది. సెక్యూరిటీని రెట్టింపు చేసారు. భద్రతా ఏర్పాట్లు పటిష్టంగా అమలవుతున్నాయి. దేశ దేశాల యాత్రికులు వెళ్ళిపోయాక మిగిలి పోయినవారిని తిరిగి వారి దేశం పంపించేందుకు చెకప్ ఎక్కువయింది. ముత్యం పోలీసులకు దొరికిపోయాడు. ఇంతకుముందు పారిపోయివచ్చిన కంపెనీ అడ్రస్ చెప్పాడు ముత్యం. అప్పటికి అతడికి అరబ్బీ భాష మాట్లాడ్డం వచ్చేసింది.

సెక్యూరిటీ వాళ్ళు ముత్యంను కంపెనీకి తీసుకువెళ్ళారు. హరిబాబు ముత్యాన్ని పక్కకు పిలిచి ముప్పయి వేలిస్తే (ఇండియా రూపాయలు) తనమనిషేనని ఒప్పుకుంటానన్నాడు. ముత్యం ఒప్పుకున్నాడు. పరిచయమున్న తెలుగువారి వద్ద అప్పుచేసి డబ్బు నింపాడు. సలాల్ వెళ్ళకుండా తన కంపెనీలోనే పనిచేయాలని షరతు పెట్టాడు హరిబాబు. చేసేది లేక ఒప్పుకున్నాడు ముత్యం. ఒప్పుకోకపోతే ఎంబసీకి రిపోర్టు ఇస్తారు. దొంగ వీసా అని వారు జైల్లో వేసి కొన్ని రోజుల తర్వాత ఇండియా పంపిస్తారు.

ముప్పై వెయిల బాకీ తీర్చడానికి మరో ఆరు నెలలు పట్టింది. అప్పటికే ముత్యం గల్ఫ్ వచ్చి ఐదేండ్లు దాటింది. అప్పులేకపోయినా చేతిలో డబ్బు నిలువలేదని, కూతురు పెళ్ళీడుకు వచ్చిందని, ఎలా పెళ్ళి చేసేదని ఇంటినుండి ఉత్తరాలు వస్తున్నాయి. మరో ఏడాది కష్టపడి అరవై వెయిలు పంపాడు ముత్యం. మళ్ళీ ఆరోగ్యం దెబ్బతిన్నది. కోలుకున్నాక డబ్బు సంపాదించాలనే ఆశతో నెలకు కొంతడబ్బు చెల్లిస్తానని లేబర్ కార్డ్, బయట పనిచేసుకోవడానికి పర్మిషన్ కార్డ్ ఇవ్వమని హరిబాబును బ్రతిమాలి ఒప్పించాడు. ముత్యం మనసు ఆనందంతో ఉరకలు వేసింది. అనుకున్నట్టుగా ముందటిలా సలాల్‌లో పని దొరకలేదు. దొరికిన డబ్బు తిండికి, హరిబాబుకు ఇవ్వడానికే సరిపోతుంది. అప్పుడే కూతురు పెళ్ళి అని ఉత్తరం వచ్చింది. ఉత్త చేతులతో వెళ్తే బాగుండదని వెళ్ళలేదు. అలాగని కూతురు పెళ్ళి ఆపగూడదనిపించింది. అందుకే మనసును చంపుకుని వస్తున్నానని ఉత్తరం వ్రాసాడు ముత్యం.

ఇప్పుడు పెళ్ళి అప్పు మిగిలింది. మరో కూతురు పెళ్ళికి ఎదిగింది. ఎలా? ఇక్కడ పని దొరికేట్టు లేదు. దొరికినా తిండికే సరిపోయేట్టుంది. ఎలా....? బ్రతుకు ప్రశ్నార్థకంగా మారిపోయింది ముత్యంకు. గల్ఫ్ వచ్చినవారున్నారు. అందులో లాభపడిన వారున్నారు. నష్టపడిన వారున్నారు. కానీ తనలా అనుక్షణం మోసానికి గురవుతూ చావలేక బతికేవారు ఎవరూ లేరనిపించింది. ఇండియా కెళ్ళి పోవాలనిపిస్తుంది. తల్లిని, తండ్రిని, భార్యను, పిల్లల్ని చూడాలనిపిస్తుంది. తను వచ్చేముందు అకతాయిగా అలిగిన కూతుళ్ళు పెళ్ళికెదిగిపోయారు. వెంటనే వారిని చూడాలని మనసు అరాటపడుతుంది. ఇన్నేండ్లు వారితో ఎడబాసి తను ఏం సంపాదించుకున్నాడు? ఎలా జరిగితే అలా జరింది. ఎన్నేండ్లున్నా లక్షలు మాత్రం సంపాదించలేను అనుకున్నాడు ముత్యం. ఇంటికి వెళ్లాలని గట్టిగా నిర్ణయించుకుని మిత్రుడు వ్రాసిన ఉత్తరం విప్పాడు.

'ప్రియమైన మిత్రుడు ముత్యంకు

నమస్కరించి వ్రాయునది

'మేము క్షేమం. నీవు క్షేమమని తలుస్తాను. ఇక్కడ కరువు పడింది. పంటలు లేవు. పని లేదు. ఎన్ని రోజులని కూసుండి తింటాం. బతకడం కష్టంగా ఉంది. అందుకే మస్కట్ రావాలని నిర్ణయించుకున్నాను. అతి కష్టం మీద విజిటింగ్ విసా సంపాదించాను. టికెట్ డేట్ వివరాలు నీకు వ్రాస్తున్నాను. దయచేసి ఏర్‌పోర్ట్‌వద్దకు రాగలవు. నీవు వస్తావనే నమ్మకంతోనే నేను విజిటింగ్ విసా తీసుకున్నాను. అక్కడికి వచ్చాక అన్ని విషయాలు మాట్లాడుకుందాం. ఇంటివద్ద మీ బంధువులంతా క్షేమం. వచ్చేముందు మీ ఇంటిలో కలిసివస్తాను. తప్పకుండా ఏర్‌పోర్ట్‌కు రాగలవు.

కృతజ్ఞతలతో...

నీ మిత్రుడు

సలిమెడ మల్లయ్య

ఉత్తరం చదవడం ముగించి దీర్ఘంగా నిట్టూర్చాడు ముత్యం. అతడు అలా రాకూడదని మనసుఘోషిస్తోంది. కానీ అప్పటికే మల్లయ్య ప్లేన్ ఎక్కాడు. ఆగని చక్రభ్రమణంలా ఈ వలససాగిపోతూనే ఉంది.